జోరుగా నామినేషన్ల పర్వం

జిల్లాలో ఎన్నికలకు నామినేషన్లు నేటితో గడువు ముగియనుండగా.. అధిక సంఖ్యలో అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేస్తున్నారు. పలువురు అభ్యర్థులు ఆలయాల్లో, మసీదుల్లో, చర్చీల్లో సర్వమత ప్రార్థనలు చేశారు. గురువారం బీఆర్‌ఎస్, కాంగ్రెస్, ఇండియన్ ప్రజా కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ, జనసేన తదితర పార్టీల అభ్యర్థులు భారీ ఎత్తున తమ నామినేషన్లను ఆయా నియోజకవర్గాల్లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఐదేళ్లు సేవచేసుకునే భాగ్యం కల్పించాలని ప్రజలను కోరారు.

సత్తుపల్లి నియోజకవర్గంలో..

సత్తుపల్లి: సత్తుపల్లి నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా సండ్ర వెంకటవీరయ్య గురువారం ఎంపీలు నామా నాగేశ్వరరావు, బండి పార్థసారధిరెడ్డి, వద్దిరాజు రవిచంద్రలతో కలిసి నామినేషన్ దాఖలు చేయగా.. కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ మట్టా రగమయి రెండో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. అదే విధంగా సత్తుపల్లి బీజేపీ అభ్యర్థిగా నంబూరి రామలింగేశ్వరరావు ఎన్నికల రిటర్నింగ్ అధికారి అశోక్‌చక్రవర్తికి నామినేషన్ దాఖలు చేశారు. సత్తుపల్లి అసెంబ్లీ నియోజకవర్గ బీఎస్పీ అభ్యర్థిగా శీలం వెంకటేశ్వరరావు నామినేషన్ దాఖలు చేశారు. అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి అశోక్‌చక్రవర్తికి అందించారు.



బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న నంబూరి రామలింగేశ్వరరావు


సండ్ర వెంకటవీరయ్య, కుమారులను సత్కరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న డాక్టర్ మట్టా రాగమయి


బీఎస్పీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న శీలం వెంకటేశ్వరరావు

వైరా నియోజకవర్గంలో..

వైరా: వైరాలో గురువారం నామినేషన్లు జోరుగా కొనసాగాయి. గురువారం ఏకాదశి మంచి రోజు కావడంతో అన్ని ప్రధాన పార్టీల అభ్యర్థులు నామనేషన్లు వేశారు. అధికార బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా బానోత్ మదన్‌లాల్.. ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావుతో కలిసి నామినేషన్లు దాఖలు చేశారు. వైరానియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా మాలోత్ రాందాస్ నాయక్ నామినేషన్ దాఖలు చేశారు. ఇండియన్ ప్రజా కాంగ్రెస్ అభ్యర్థిగా బానోత్ దుర్గా ప్రసాద్ నామినేషన్ దాఖలు చేయగా.. బీఎస్పీ అభ్యర్థిగా బానోత్ రాంబాబు నామినేషన్ పత్రాలు అందజేశారు. బీజేపీ బలపర్చిన జనసేన అభ్యర్థిగా తేజావత్ సంపత్‌కుమార్ నామినేషన్ దాఖలు చేశారు.


నామినేషన్ దాఖలు చేస్తున్న బీఎస్పీ అభ్యర్థి బానోత్ రాంబాబు


నామినేషన్ వేస్తున్న జనసేన అభ్యర్థి తేజావత్ సంపత్‌కుమార్


ఆర్‌ఓకు నామినేషన్ పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రాందాస్ నాయక్


నామినేషన్ పత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి మదన్‌లాల్


నామినేషన్ సమర్పిస్తున్న ఇండియన్ ప్రజా కాంగ్రెస్ అభ్యర్థి దుర్గా ప్రసాద్

మధిర నియోజకవర్గంలో..

మధిర: మధిర నుంచి పోటీ చేసే అభ్యర్థులు గురువారం మంచి రోజు కావడంతో ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులతో పాటు స్వతంత్ర్య అభ్యర్థులు కూడా నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, బీఆర్‌ఎస్ అభ్యర్థి జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థిగా శారద, సీపీఎం అభ్యర్థిగా పాలడుగు భాస్కర్‌తో పాటు బీఆర్‌ఎస్ రెబల్ అభ్యర్థిగా బొమ్మెర రామ్మూర్తి రెండో సెట్ నామినేషన్లు రిటర్నింగ్ అధికారి గణేష్‌కు అందజేశారు.


నామినేషన్ దాఖలు చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి లింగాల కమల్‌రాజ్


నామినేషన్ అందిస్తున్న బీఎస్పీ అభ్యర్థి శారద


నామినేషన్ దాఖలు చేస్తున్న సీపీఎం అభ్యర్థి పాలడుగు భాస్కర్

సేవకుడిగా పనిచేస్తా..


సమావేశంలో మాట్లాడుతున్న లింగాల కమల్‌రాజ్

మధిర/బోనకల్: సామాన్యుడిగా ఉన్న తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి సేవకుడిగా పని చేస్తానని బీఆర్‌ఎస్ అభ్యర్థి, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ అన్నారు. మధిర బీఆర్‌ఎస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అదే విధంగా బోనకల్ మండలంలోని తూటికుంట్ల, లక్ష్మీపురం, గోవిందాపురం, గార్లపాడు గ్రామాల్లో గురువారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన తాను ఈ ప్రాంత ప్రజల కష్టసుఖాలు, సమస్యలు తెలిసిన వాడినని అన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి మధిరకు చేసింది శూన్యమని, కనీసం ప్రజలకు అందుబాటులో కూడా లేడన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రతిపక్షాలకు అడిగేందుకు అవకాశం లేకుండా అనేక పథకాలను ప్రవేశపెట్టారని.. మధిర గడ్డపై గులాబీ జెండా ఎగురవేయాలన్నారు. అనంతరం రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు మాట్లాడుతూ.. సీఎం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మరింత చేరువ కావాలంటే కమల్‌రాజ్‌ని గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు దొండపాటి వెంకటేశ్వరరావు, గుర్రం రామారావు, చిత్తారు నాగేశ్వరరావు, రావూరి శ్రీనివాసరావు, కనుమూరి వెంకటేశ్వరరావు, తాళ్లూరి హరీష్ బాబు, కూనా నరేందర్ రెడ్డి, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బందం శ్రీను, మండల అధ్యక్ష,కార్యదర్శులు చేబ్రోలు మల్లికార్జున్, మోదుగుల నాగేశ్వరరావు, బానోత్ కొండ, వేమూరి ప్రసాద్, చావా హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కేసీఆర్‌ను గద్దె దించాలి


వైరా టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న రాజశేఖర్

వైరా: సీఎం కేసీఆర్‌ను గద్దె దించడమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని మాజీ మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. గురువారం వైరాలో టీడీపీ వైరా నియోజకవర్గ సమావేశానికి హాజరైన వారు టీడీపీ నాయకులనుద్దేశించి మాట్లాడారు. శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రాందాస్ నాయక్‌కు మద్దతు ఇవ్వాలని కోరగా టీడీపీ నాయకులు మద్దతు ఇవ్వడానికి అంగీకరించారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను గెలిచిన 100 రోజుల్లో అమలు చేసి తీరుతామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెరుకూరి చలపతిరావు, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, దానియేలు, వెంకటనర్సిరెడ్డి, మండల కాంగ్రెస్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వినికిడి యంత్రాలు పంపిణీ


వినికిడి యంత్రాలను అందజేస్తున్న భవిత కేంద్రం నిర్వాహకులు

చింతకాని: మండలంలోని లచ్చగూడెం గ్రామంలోని భవిత కేంద్రంలో తెలంగాణ సమగ్ర శిక్షా అభియాన్, ఎలిమికో అలింకో సహకారంతో మండలంలోని సీతంపేట, ప్రొద్దుటూరు గ్రామాలకు చెందిన స్పందన, కీర్తిలకు వినికిడి యంత్రాలను గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహ్మద్ హుస్సేన్, పాఠశాల ఉపాధ్యాయులు వెంకటేశ్వరరెడ్డి, ఐఈఆర్పీలు కేఎస్ కృష్ణారావు, భూక్యా దస్లీ, భవిత కేంద్రం సంరక్షకురాలు అరికొట్ల లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.

తల్లాడలో కార్గో ప్రైవేట్ సేవలు ప్రారంభం


తల్లాడలో కార్గో ఏజెన్సీని ప్రారంభిస్తున్న వర్మ

తల్లాడ: తల్లాడ ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం కార్గో ప్రైవేట్ ఏజెన్సీ సేవలను ఖమ్మం రీజియన్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లాడ కార్గో సేవలు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉంటాయని.. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మధిర, సత్తుపల్లి మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్‌లు వెంకటేశ్వరరావు, మునీర్ పాషా, ఏజెంట్ రవి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలకు నంబర్లు

సత్తుపల్లిటౌన్: ఈ నెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం అధికారులు పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తున్నారు. పోలింగ్‌రోజున ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చే ఓటర్లు పోలింగ్ కేంద్రం ఎక్కడ ఉందో తెలుసుకునేందుకు తికమక పడుతుంటారు. గతంలో కంటే ఓటర్లు పెరగటంతో పోలింగ్ కేంద్రాలు పెరిగాయి. కొన్నిచోట్ల పోలింగ్ కేంద్రాలు మారాయి. ఇలాంటి పరిస్థితిలో ఓటర్లు ఇబ్బంది పడకుండా ఉండేందుకు అందరికి తెలిసేలా పోలింగ్ కేంద్రాల ముందు సంఖ్య రాస్తున్నారు. పెద్ద నంబర్లు వేసి పోలింగ్‌కేంద్రంతో పాటు నియోజకవర్గం సంఖ్యను కూడా రాశారు. అంతేకాకుండా ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉన్న ఓటర్ల జాబితాలను అంటించారు. సత్తుపల్లి నియోజకవర్గంలో గత ఎన్నికల్లో 264 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. ప్రస్తుతం 291 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. తల్లాడ మండలంలో 57, కల్లూరు మండలంలో 63, పెనుబల్లిలో 50, సత్తుపల్లిలో 75, వేంసూరులో 46 చొప్పున పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఓటర్లకు బూత్‌లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి పోలింగ్ కేంద్రాలపై అవగాహన కల్పిస్తున్నారు.



పోలింగ్ కేంద్రం వద్ద నంబర్లు, ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న సెక్టోరల్ అధికారి

ఉచిత న్యాయ సాయం


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి అరుణకుమారి

సత్తుపల్లిటౌన్: న్యాయ సేవాధికార సంస్థ ద్వారా మహిళలు, దివ్యాంగులు, పిల్లలకు ఉచిత న్యాయ సాయం అందించడం జరుగుతుందని సత్తుపల్లి సీనియర్ సివిల్ జడ్జి పి.అరుణకుమారి అన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం సత్తుపల్లి కోర్టులో జరిగిన న్యాయ చైతన్య సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ సంస్థ ద్వారా సత్వర సేవలు పొందవచ్చన్నారు. దేశంలోని ప్రజలందరికీ న్యాయం అందించాలనే ఉద్దేశ్యంతో ఈ సంస్థ ఏర్పాటైందన్నారు. సమావేశంలో జూనియర్ సివిల్ జడ్జి ఆయేషాసరీన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పాలపాటి శ్రీనివాసరావు, న్యాయవాదులు బొర్రా వెంకట్రావ్, తిరుమలరావు, కిరణ్‌రంజని, విజయ్‌కుమార్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

గోపాలమిత్ర పశు వైద్యశిబిరం

కొణిజర్ల: మండలంలోని చిన్నగోపతి గ్రామంలో గురువారం గోపాలమిత్ర పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని తనికెళ్ల పశు వైద్యాధికారి డాక్టర్ నాగమణి ప్రారంభించి పశువులలో గర్భకోశ వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం దూడలకు నట్టల నివారణ మందులు తాగించారు. కార్యక్రమంలో గోపాలమిత్రల సూపర్‌వైజర్ లక్ష్మణ్‌చారి, గోపాలమిత్రలు రామారావు, సైదులు, గోపీనాథ్, వెటర్నరీ అసిస్టెంట్ సలీమ్ తదితరులు పాల్గొన్నారు

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

వైరారూరల్: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి గిట్టుబాటు ధర పొందాలని డీసీఎంఎస్ మేనేజర్ సందీప్ అన్నారు. గురువారం మండలంలోని గొల్లపూడి, కొండకొడిమ, ముసలిమడుగు, లక్ష్మీపురం, కేజీ సిరిపురం గ్రామాల్లో గురువారం డీసీఎంఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంస్ మేనేజర్ సందీప్, వైరా ఏఎంసీ కార్యదర్శి ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఎన్నికల కార్యాలయం ప్రారంభం


బీఆర్‌ఎస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రెడ్డెం వీరమోహన్‌రెడ్డి

తల్లాడ: తల్లాడలో బీఆర్‌ఎస్ ఎన్నికల కార్యాలయాన్ని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రెడ్డెం వీరమోహన్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో సండ్ర వెంకటవీరయ్య గెలుపును కాంక్షిస్తూ ఈ కార్యాలయాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు ఎన్నికల కార్యాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దూపాటి భద్రరాజు, దుగ్గిదేవర వెంకట్‌లాల్, షేక్ ఈసూబ్, దగ్గుల శ్రీనివాసరెడ్డి, జీవీఆర్, దగ్గుల రాజశేఖర్‌రెడ్డి, గుండ్ల వెంకటేశ్వర్లు, వీరకృష్ణ, నాగులు, శివ, మహేష్, రంగారావు పాల్గొన్నారు.

విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలి

తల్లాడ/సత్తుపల్లిరూరల్: ఈ నెల 11న హైదరాబాద్‌లో మందా కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరిగే విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు ఇస్నేపల్లి అశోక్ మాదిగ, ఎంఈఎఫ్, ఎమ్మార్పీఎఫ్ నాయకులు వెంకటేశ్వరరావు వీరన్నలు తెలిపారు. గురువారం తల్లాడ, సత్తుపల్లిలో విశ్వరూప మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ మహాసభకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరౌతారని తెలిపారు. ఈ మహాసభకు ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కోట బలరాం, అద్దంకి వెంకటేశ్వర్లు, ఎంఈఎఫ్, ఎమ్మార్పీఎస్ నాయకులు సింగపోగు పుల్లారావు, ఇనపనూరి నాగేశ్వరరావు, నవకుమార్, గోల్లమందల ముత్తారావు, గోల్లమూడి శ్రీనివాసరావు, పరిగడుపు లక్ష్మణ్, తాళ్ల అర్జున్‌రావు, జానపాటి అశోక్, తడికమళ్ల దాసు తదితరులు పాల్గొన్నారు.


సత్తుపల్లిరూరల్: విశ్వరూప మహాసభ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఓటరు సెల్ఫీపాయింట్

సత్తుపల్లిటౌన్: ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు సత్తుపల్లి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ సెంటర్, మున్సిపాలిటీ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఓటరు సెల్ఫీ పాయింట్‌లకు యువత సెల్ఫీలు దిగేందుకు ఆసక్తి చూపించారు.



సెల్ఫీ దిగుతున్న యువకులు

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

ముదిగొండ: మండలంలోని మేడేపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఆరుగురు విద్యార్థులు గద్వాల్‌లో జరిగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ కృష్ణయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్14 బాలికల జట్టులో పావని, లావణ్య, అండర్17 బాలికల విభాగంలో యామిని, వయ వర్షిణి, కావ్య, అండర్ 14బాలుర విభాగంలో ప్రయణ్‌లు రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఎంపీపీ సామినేని హరిప్రసాద్, సర్పంచ్ సామినేని రమేష్, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ సమత, ఉపాధ్యాయులు, పీఈటీలు అభినందించారు.

పోలీసుల కవాతు

ముదిగొండ: సమస్యాత్మక గ్రామాలైన వనంవారికిష్టాపురం, యడవల్లి, కట్టకూరు, గోకినేపల్లి, ముదిగొండ గ్రామాల్లో కేంద్ర పోలీస్ బలగాలు గురువారం కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ కేఆర్‌కే ప్రసాద్, ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి, సీసీఎస్ ఏసీపీ రవి, ఖమ్మం రూరల్ సీఐ రాజిరెడ్డి, ఎస్సై నరేష్‌లు పాల్గొన్నారు.

భట్టి నామినేషన్‌కు తరలిన పార్టీ శ్రేణులు

చింతకాని: సీఎల్పీ నేత, మధిర నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లు భట్టివిక్రమార్క ఎన్నికల నామినేషన్ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మధిరకు గురువారం భారీగా తరలివెళ్లారు. కార్లు, టాటా ఏస్‌లు, ద్విచక్ర వాహనాల్లో వెళ్లారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు, నాయకులు మడుపల్లి భాస్కర్, కూరపాటి కిషోర్, కన్నెబోయిన గోపి, బందెల నాగార్జున్, కొప్పుల గోవిందరావు, కంచం కోటేశ్వరరావు, పెంట్యాల అప్పారావు, తిరుపతి గోవిందరావు, సట్టు వెంకటేశ్వర్లు, ఆలస్యం బస్వయ్య, ఆళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు ఓర్సు వీరభద్రం, యాకోబు, ప్రసాద్‌రావు, గ్రామసర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి

కొణిజర్ల: మండలంలోని కొండవనమాల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మద్దిన్ని కృష్ణ(40) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కృష్ణ మృతి వార్త తెలుసుకున్న సీపీఐ ఖమ్మం జిల్లా సమితి సభ్యుడు యర్రా బాబు మృతదేహాన్ని సందర్శించి మృతదేహంపై ఎర్ర జెండా కప్పి నివాళులు అర్పించారు. కృష్ణ మృతికి సంతాపం తెలిపిన వారిలో మాజీ సర్పంచ్ చినవెంకటి, రామారావు, పెద్దబాబు, పెద్దమునగాల మాజీ సర్పంచ్ పాపయ్య, శ్రీను, నాగయ్య, మురళి, రాంబాబు ఉన్నారు.

మాదిగలకు అన్యాయం చేశారు..

సత్తుపల్లిరూరల్: రాష్ట్రంలో మాదిగ సామాజిక వర్గానికి అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ పార్టీని మాదిగలు ఓడించాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బండారు వీరబాబు అన్నారు. అంబేడ్కర్ యువజన సంఘం, ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ, ఎమ్మార్పీఎస్, టీ.ఎమ్మార్పీస్ తదితర సంఘాలు సత్తుపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్యకు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా గురువారం సత్తుపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయం కోసం మూడు దశాబ్దాలుగా పోరాడుతున్నా.. మాదిగలు ఎదగడానికి గతంలో పాలించిన కాంగ్రెస్ నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో సండ్ర వెంకటవీరయ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు గొల్లమందల శ్రీనివాసరావు, కనకపూడి సతీష్, మహేష్, పవన్, కళ్యాణ్, నగేష్, సతీష్, గద్దం పండు, అనీల్, ప్రకాష్, గద్దం ప్రభాకర్, వేణు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బండారు వీరబాబు

సాయినాధుడికి ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లో సాయిబాబా ఆలయాల్లో గురువారం సాయినాధుడికి అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. బాబాకి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. పలు గ్రామాల భక్తులు బాబాని దర్శించుకుని పూజలు జరుపుకున్నారు. మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కంచర్ల వెంకటస్వామి, తదితరులు ఉన్నారు.

అమరవీరుల ఆశయాలను కొనసాగించాలి

కారేపల్లి: అమరవీరుల ఆశయాలను కొనసాగించాలని.. వారు చూపిన బాటలో ముందుకు సాగాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి ప్రకాశ్ అన్నారు. గురువారం మండలంలోని పేరుపల్లి గ్రామంలో అమరవీరుల సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరులు బొల్ల లింగయ్య, పెద్దబోయిన వెంకన్న, బిక్కుమియా, తుమ్మలపల్లి హన్మంతరావు, ధరావత్ కస్నా, గండు మల్లయ్య, పానుగంటి లక్ష్మారెడ్డి, కొప్పుల గురుస్వామి, ఊడుగుల వెంకటమల్లు, కోరం పొట్టయ్య, మల్కం చంద్రయ్య, ముదిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మలపల్లి శ్రీనులను స్మరిస్తూ.. పార్టీ జెండాలను ఎగురవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, గురవయ్య, జానకి, సుగుణ, మంగమ్మ, లక్ష్మయ్య, సంపత్, కోటయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


పేరుపల్లిలో అమరులకు నివాళులు అర్పిస్తున్న ఎన్డీ నాయకులు

అటెన్షన్ ప్లీజ్

ఆగని ఇసుక దందా..



ముదిగొండ మండలంలో ఇసుక అక్రమ రవాణా ఆగడంలేదు. ఎలాంటి అనుమతులు లేకుండా గంధసిరి, పెద్దమండవ మున్నేరుల నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. దీంతో ప్రధాన ముదిగొండ, న్యూలక్ష్మీపురం, వల్లబి రోడ్లు విపరీతమైన గంతలు పడి ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. దీంతో ఆర్‌అండ్‌బీ, మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలొస్తున్నాయి. ఇంత జరుగుతున్నా సంభంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. కనీసం ప్రధాన రహదారులపై గుంతలు పడినా, వాటిలో తట్టెడు మట్టిపోసిన పాపానా పోలేదు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గుంతలను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు. - ముదిగొండ

ప్రశ్నించాల్సిన అధికారి : సంజయ్‌కుమార్, మైనింగ్ ఏడీ, ఖమ్మం
సెల్ నంబర్ : 9603134117